సాక్షి బాపట్ల

మంగళవారం, 12, ఆగస్టు, 2025



నిర్మాణ పనులు పరిశీలన

తాడికొండ: రాయపూడిలోని సీఆర్డీఏ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని సోమవారం మంత్రి నారాయణ పరిశీలించారు. ఏ+7 అంతస్తులతో ఇది నిర్మాణంలో ఉందన్నారు.



పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి సోమవారం 6,908 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.



జర్నలిజం పరీక్షలు ప్రారంభం

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం డిప్లమో ఇన్ జర్నలిజం కోర్సు పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 14తో ముగుస్తాయి.

న్యూస్‌రీల్

గవర్నర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్



గుంటూరు ఎడ్యుకేషన్ : స్థానిక శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మంగళవారం రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారు. ఈ దృష్ట్యా సోమవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కార్యక్రమ ఏర్పాట్లు పరిశీలించారు. 'ఏపీ క్లైమెట్ యాక్షన్ క్యాంపెయిన్ అండ్ అమరావతి ప్లాస్టిక్ ఫ్రీ సిటీ' ప్రచార కార్యక్రమాన్ని గవర్నర్ ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో వేంకటేశ్వర విజ్ఞాన మందిరాన్ని సందర్శించిన కలెక్టర్ సీటింగ్ ఏర్పాట్లపై అధికారులతో పాటు రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులతో చర్చించారు. కార్యక్రమంలో జేసీ ఏ.భార్గవ్‌తేజ, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వైటీ రామారావు, కోశాధికారి పి. రామచంద్రరాజు, తూర్పు మండల తహసీల్దార్ సుభానీ ఇతర అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ రెండవ వైస్ చైర్మన్ రాజీనామా ఆమోదం



చీరాల: చీరాల మున్సిపల్ రెండవ వైస్ చైర్మన్ శిఖాకొల్లి రామసుబ్బులు గత నెల 14న తన పదవికి రాజీనామా చేస్తూ కమిషనర్‌కు లేఖను అందించారు. వైఎస్సార్ సీపీకి చెందిన రామసుబ్బులు వైస్ చైర్మన్ పదవికి సంబంధించిన రాజీనామాపై సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించారు. త్వరలో వైస్ చైర్మన్–2ను భర్తీ చేస్తామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చీరాల మున్సిపాలిటీలో పలు సమస్యలు ఉన్నాయని, ప్రధానంగా డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు.

సెలవు దినాల్లో గ్రీవెన్స్ ఉండదు

తాడికొండ: రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే 'గ్రీవెన్స్' కార్యక్రమం ప్రభుత్వ సెలవు దినాలలో జరగదని కమిషనర్ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ సెలవు, ఆ రోజు కార్యక్రమం ఉండదన్నారు. రాజధాని రైతులు, భూ యజమానులు తమ వినతులు, ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పరిష్కారం పోర్టల్ ద్వారా ఎప్పుడైనా సమర్పించవచ్చని పేర్కొన్నారు.

కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం తీవ్రనష్టం



యద్దనపూడి: కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం దేశానికి తీవ్ర నష్టమని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు వై.కేశవరావు హెచ్చరించారు. రైతు ఉద్యమాల స్ఫూర్తి ప్రదాత పోపూరి రామారావు 6వ వర్ధంతి, హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ శత జయంతి సభ స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో నూతలపాటి కాళిదాసు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. కేశవరావు మాట్లాడుతూ పోపూరి రామారావుతో సుదీర్ఘకాలం రైతు ఉద్యమంలో పనిచేసిన రోజులను గుర్తుచేసుకున్నారు. హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ సేవలను స్మరించుకున్నారు. ఆలోకం పెద్దబ్బాయి, ప్రొఫెసర్ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

మైనర్‌బాలిక వివాహాన్ని నిలిపివేసిన అధికారులు

ఊటుకూరు(క్రోసూరు) : ఊటుకూరు గ్రామంలో సోమవారం మైనర్ వివాహం జరుగుతుందన్న సమాచారం మేరకు ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.వెంకటలక్ష్మి, ఎంపీడీవో రవికుమార్ వెళ్లి వివాహాన్ని నిలిపివేశారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అమ్మాయికి 19 సంవత్సరాలు నిండిన తరువాత వివాహం చేయాలని తెలిపారు. బాల్యవివాహ నిరోధక చట్టం ప్రకారం పెళ్లికి సహకరించిన ప్రతి ఒక్కరు శిక్షార్హులేనని అన్నారు. ఈ సందర్భంగా తల్లిని, మేనమామను బైండోవర్ చేశారు.

అసెస్‌మెంట్.. హరాస్‌మెంట్!

- పరీక్షల సంస్కరణ పేరిట మూల్యాంకన పుస్తకాలు పంపిణీ
- పాఠశాలల్లో సమయం సరిపోదంటున్న ఉపాధ్యాయులు
- కూటమి సర్కార్ అడ్డగోలు నిర్ణయాలతో అందరికీ అవస్థలు
- విద్యార్థులకు కూడా నష్టం చేసేలా కొత్త విధానం అమలు

కూటమి పాలనలో అడ్డగోలు నిర్ణయాలతో గురువులపై భారం

కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యాశాఖ తీరు అధ్వానంగా మారింది. అడ్డగోలు నిర్ణయాలు తీసుకుని వెంటనే అమలు చేస్తుండటంతో విద్యాప్రమాణాలు తీసికట్టుగా మారుతున్నాయి. ఇదే కోవలో పరీక్షల్లో అసెస్‌మెంట్ పుస్తకాల విధానంతో అటు విద్యార్థులు, ఇటు గురువులు నష్టపోతున్నారు. మూల్యాంకన భారం గురువులపై పడుతోంది. విద్యార్థులు కూడా గతంలో రాసిన సమాధానాలే మళ్లీ చూసి రాసేలా తెచ్చిన ఈ విధానంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

చీరాల అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించే పరీక్షలకు సంబంధించిన మూల్యాంకన పుస్తకాలు ఇవ్వడంపై ఉపాధ్యాయులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే విద్యాశాఖ అమలు చేస్తున్న బోధనేతర పనులతో వారు సతమతం అవుతున్నారు. ఈ తరుణంలో కొత్తగా మూల్యాంకన పుస్తకాలను కూటమి సర్కార్ తెరపైకి తీసుకొచ్చింది. గతంలో పరీక్షల సమయంలో కాగితాలపై జవాబులు రాస్తే ఉపాధ్యాయులు ఇంటికి తీసుకువెళ్లి దిద్దేవారు. ఇప్పుడు మూల్యాంకన పుస్తకాలను విద్యార్థులకు అందించారు. చీరాల మండలంలో 1 నుంచి 10వ తరగతి వరకు మొత్తం 7,315 పుస్తకాలను అందించారు.

పరీక్షలు ప్రారంభం

విద్యా సంవత్సరంలో విద్యార్థి అభ్యసన మదింపు కోసం ఏటా ఫార్మెటివ్, సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను నిర్వహిస్తారు. ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను గతేడాది నుంచి, సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్ 1, 2, 3, 4గా వ్యవహరిస్తున్నారు. 2025–26 విద్యా సంవత్సరంలో నాలుగు సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు, రెండు సమ్మేటివ్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. మొదటి పరీక్షను సోమవారం నిర్వహించారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం జూన్ 12న పాఠశాలలు ప్రారంభమయ్యాయి. వాస్తవానికి ఈ పరీక్షలు ఈనెల 4వ తేదీ నుంచి జరగాల్సి ఉంది. అసెస్‌మెంట్ బుక్‌లెట్స్ పాఠశాలలకు చేరుకోవడం ఆలస్యం కావడంతో సోమవారం నుంచి నిర్వహిస్తున్నారు. జూన్, జూలై సిలబస్‌కు సంబంధించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై పరీక్షలు పెట్టారు.

దిద్దేందుకు సమయమేది?

గతంలో నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాలను ఇంటికి తీసుకెళ్లి దిద్ది పాఠశాలలకు తీసుకువచ్చేవారు. ఉపాధ్యాయుల వెసులుబాటును బట్టి బడిలోనే పేపర్లను దిద్దేవారు. ఇప్పుడు మూల్యాంకనం పుస్తకాలను ఇంటికి మోసుకెళ్లే పరిస్థితి లేదు. ఆరో తరగతిలో 40 మంది విద్యార్థులంటే మూల్యాంకనం పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లి దిద్దడానికి వీలులేదు. హైస్కూల్‌లో ఒక ఉపాధ్యాయుడు నాలుగు తరగతులకు వెళ్తే వారం పాటు ఇదే పని చేస్తేగానీ పూర్తవుతుంది. ఈ పుస్తకాలను సబ్జెక్టు ఉపాధ్యాయుడు భద్రపరచుకోవాలి. పరీక్షల నిర్వహణలో సంస్కరణలు అమలు చేసేటప్పుడు సాధ్యాసాధ్యాలపై ఆలోచించాలని ఉపాధ్యాయులు గుర్తుచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం కనీసం నిపుణులతోనైనా చర్చించాల్సి ఉందన్నారు. అలా కాకుండా ఏకపక్షంగా అమలు చేస్తే వ్యతిరేక ఫలితాలు వస్తాయని హెచ్చరిస్తున్నారు.



నిర్బంధంగా 'విద్యాశక్తి'

హైస్కూళ్లలో సాయంత్రం 4 గంటల తర్వాత విద్యాశక్తి కార్యక్రమాన్ని విద్యాశాఖ అమలు చేస్తోంది. ముందు ఎంపిక చేసిన పాఠశాలల్లో అమలు చేస్తామని చెప్పి అన్నిచోట్ల ప్రవేశపెట్టారు. ఉపాధ్యాయ సంఘాలు అడిగినప్పుడు నిర్బంధం కాదని చెబుతున్న ఉన్నతాధికారులు.. ఆ తర్వాత మాత్రం ఉపాధ్యాయులపై మండల స్థాయి అధికారులతో ఒత్తిడి తెస్తున్నారు. 'మేం వస్తున్నాం.. తనిఖీ చేస్తాం' బెదిరిస్తున్నారు.

మూల్యాంకన పుస్తకాలపై ఉపాధ్యాయులలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇస్తున్న పనులను చేయడానికి ఎక్కువ సమయం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో మూల్యాంకన పుస్తకాన్ని ప్రభుత్వం ఇచ్చింది.

పుస్తకాలపై తీవ్ర వ్యతిరేకత

ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఒక్కో విద్యార్థికి ఆరు మూల్యాంకన పుస్తకాలు అందాయి. ఫార్మేటివ్, సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను ఆ పుస్తకాల్లోనే విద్యార్థులు రాయాలి. పరీక్షలు రాసిన తర్వాత వాటిని దిద్ది అందులోనే ఉన్న ఓఎమ్మార్ షీట్‌లో మార్కులు వేయడంతో పాటు ఓఎమ్మార్ షీట్‌ను విద్యాశాఖ ఇచ్చిన యాప్‌లో ఉపాధ్యాయులు అప్‌లోడ్ చేయాలి. ముందు జవాబు పత్రాలన్నింటినీ స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలని సూచించగా, ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దీంతో విద్యాశాఖ అధికారులు ఈ విధానం విరమించుకున్నారు.



సీఐ, ఎస్‌ఐలపై చర్యలు తీసుకోవాలి

- రైతుల సమస్యలపై పోరాడితే పోలీసులు దాడి చేయడం దారుణం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు



రేపల్లె డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన వరికూటి అశోక్‌బాబు

వేమూరు: రైతుల సమస్యల పరిష్కారానికి తాను దీక్ష చేస్తున్న సమయంలో రేపల్లె సీఐ మల్లికార్జునరావు, నగరం ఎస్‌ఐ బండ్ల భార్గవ్, ఆడవుల దీవి ఎస్‌ఐ బత్తుల బాబురావు, హెడ్ కానిస్టేబుల్ యార్లగడ్డ సోమశేఖర్‌లు దాడి చేసినందున వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లా ఎస్పీ కార్యాలయంలో, రేపల్లె డీఎస్పీ కార్యాలయంలో ఈ మేరకు ఆయన సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజనులో కాలువల్లో గుర్రపు డెక్క, తూటికాడ వలన నీరు వెళ్లే పరిస్థితి లేదని, పంట పొలాలు మునిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. భట్టిప్రోలు డ్రైనేజీ కింద 2 వేల ఎకరాలు మునిగి పోయిన విషయాన్ని గుర్తుచేశారు. గతేడాది కనగాల డ్రైనేజీ కింద 3 వేల ఎకరాలు మునిగి పంటలు పూర్తిగా దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. కాలువల్లో పూడిక తొలగించాలని అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని తెలిపారు. రేపల్లె ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఆగస్టు 2 వ తేదీన దీక్ష చేపట్టినట్లు పేర్కొన్నారు. రేపల్లె సీఐ మల్లికార్జునరావు, నగరం, ఆడవుల దీవి ఎస్‌ఐలు తనపై దాడి చేశారని ఆరోపించారు. చికిత్స పొందుతూనే రేపల్లె ప్రభుత్వ వైద్యశాల్లో ఆమరణ దీక్ష చేశానని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు రైతుల సమస్య పరిష్కారం చేయడంతో దీక్ష విరమించినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దాడికి పాల్పడిన పోలీసులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రైతుల సమస్యలపై పోరాడితే ఇలా పోలీసులు దాడి చేయడం దారుణమని అన్నారు. కూటమి ప్రభుత్వం అండతో పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే తర్వాత వారి పరిస్థితి చాలా దారుణంగా ఉంటుందని హెచ్చరించారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పొగాకు కొనాలని రైతుల ధర్నా

నరసరావుపేట రూరల్: రైతుల వద్ద ఉన్న పొగాకు నిల్వలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈపూరు మండలం అగ్నిగుండాల గ్రామానికి చెందిన రైతులు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఐటీసీ సంస్థ సహకారంతో గత మూడు సంవత్సరాలుగా వైట్‌బర్లీ పొగాకు పంటను సాగు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. గత ఏడాది పంట చేతికొచ్చే సమయానికి ఐటీసీ సంస్థ పంట కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డామని వివరించారు. ఈ ఏడాది పొలాలను కౌలుకు తీసుకొని షెడ్లు నిర్మించి పంట సాగుకు సిద్ధమయ్యామని తెలిపారు. ప్రభుత్వంతో పాటు ఐటీసీ సంస్థ పొగాకు సాగుచేయొద్దంటూ రైతులను అడ్డుకుంటుందని తెలిపారు. దీని వలన పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. రైతుల వద్ద ఉన్న పొగాకు నిల్వలను వెంటనే కొనుగోలు చేయడంతో పాటు ఈ ఏడాది పంట సాగుకు ఐటీసీ సంస్థ ద్వారా బాండ్లు ఇప్పించి సహకరించాలని కోరారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు.



జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

అధికారులకు ఇన్‌చార్జి జేసీ గంగాధర్ గౌడ్ ఆదేశం



అర్జీదారుల సమస్యలు ఆలకిస్తున్న ఇన్‌చార్జి జేసీ గంగాధర్ గౌడ్

బాపట్ల: ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఇన్‌చార్జి జిల్లా సంయుక్త కలెక్టర్ జి. గంగాధర్ గౌడ్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే వినతులను తక్షణమే పరిష్కరించేలా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మొత్తం 160 అర్జీలు అందాయి.

స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్లు

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన తెలిపారు. విశిష్ట సేవలు అందిస్తున్న అధికారులు, ఉద్యోగులకు అవార్డుల ప్రదానం చేయనున్నట్లు వివరించారు. స్వాతంత్ర్య సమర యోధులను సత్కరించడానికి ఘనంగా ఆహ్వానించాలన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గ్రామ, మండల స్థాయిలో పాఠశాల విద్యార్థులకు 'నా దేశం – నా జెండా' అంశంపై వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మండల స్థాయి విజేతలకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహిస్తామని, ఆగస్టు 15వ తేదీన బహుమతుల ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, బాపట్ల ఆర్డీఓ గ్లోరియా, ఉప కలెక్టర్ లవన్న తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడండి

గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

పట్నంబజారు: నగరంలో శంకర్‌విలాస్ ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభమైన నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కంకరగుంట అండర్ పాస్, బ్రాడీపేట 4వ లైను, శంకర్‌విలాస్ సెంటర్, డొంకరోడ్డు, మూడు వంతెనలు, రంగాబొమ్మ సెంటర్, కొత్తపేట శివాలయం సెంటర్, భగత్‌సింగ్ సెంటర్, డీమార్ట్, నాజ్ సెంటర్, ఉమెన్స్ కళాశాల రోడ్డు, ఎంటీబీ సెంటర్‌లలో బైక్‌పై ఆయన పర్యటించారు. వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఏ అశోక్‌కుమార్‌లకు పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ నిలవకుండా సిబ్బంది సమర్థంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. వాహనదారులకు సమన్వయంతో ట్రాఫిక్ డైవర్షన్ల గురించి వివరించాలని, వారు తప్పక పాటించేలా చూడాలని ఆదేశించారు.

సహనంతో విధులు నిర్వర్తించాలి

ట్రాఫిక్ నెమ్మదించినా.. కొద్దిపాటి ఇబ్బందులు కలిగినా.. సహనం పాటించాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. వ్యాపార సముదాయాల వారు తమ కస్టమర్ల కోసం ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని సూచించారు. వాహనదారులు రోడ్డుపై కాకుండా నిర్ణీత పార్కింగ్ స్థలాల్లో వాహనాలు నిలిపేలా చూసుకోవాలన్నారు. మళ్లింపులకు సంబంధించి సూచిక బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సీఐలు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని పర్యవేక్షించాలని పేర్కొన్నారు. అవసరమైన చోట సిబ్బందిని అధికంగా కేటాయించటం, ముఖ్యమైన కూడళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టి సారించాలన్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ వెంట అరండల్‌పేట సీఐ ఆరోగ్యరాజు, ట్రాఫిక్ ఎస్సై సాంబశివరావునాయక్ తదితరులు ఉన్నారు.



పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్

'జీరో' దందాలో అక్రమ 'వసూళ్లు'

ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా కొందరు జీరో వ్యాపారాన్ని యథేచ్ఛగా సాగిస్తున్నారు. అధికారులు, వ్యాపారాలు కుమ్మక్కై లాభాలను అందినకాడికి జేబుల్లో వేసుకుంటున్నారు. చీరాల కేంద్రంగా జీరో వ్యాపారం జోరుగా సాగుతోంది. కింది స్థాయి సిబ్బంది వసూళ్లతో కనీస చర్యలు లేవు.

- చీరాల కేంద్రంగా జీరో వ్యాపారం
- పలు ప్రాంతాలకు వేరుశనగ పప్పు అడ్డగోలుగా సరఫరా
- జీఎస్టీ లేకుండానే జోరుగా వ్యాపారం
- కనీసం పట్టించుకోని అధికారులు
- జీడిపప్పు విషయంలో నగం కొనుగోలుకు మాత్రమే జీఎస్టీ
- రెడీమేడ్ వస్త్రాలు అక్రమ మార్గాన సరఫరా
- పలు పార్శిల్ కార్యాలయాల్లో జీఎస్టీ లేని వస్త్రాల నిల్వలు
- నెలకు రూ.కోట్ల మేరకు సర్కారు ఖజానాకు నష్టం
- అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న దిగువ స్థాయి సిబ్బంది

చీరాల: ఏటా ఆర్థిక సంవత్సరం ముగింపులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులను ఎగవేస్తూ కొందరు వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతున్నారు. జీరో వ్యాపారం సాగించడంతో ఖజానాకు పన్నుల రూపంలో అందాల్సిన నగదు తాయిలాలుగా మారుతోంది.

తక్కువ చేసినట్లుగా చూపించి..

ఇంత జరుగుతున్నా జీఎస్టీ అధికారులు మాత్రం తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. వాణిజ్య సంస్థలు నడుపుతున్న వ్యాపారాలు వారు చేసే లావాదేవీలకు సంబంధించి ఆర్థిక సంవత్సరం ముగింపు సమయంలో పన్నులను సక్రమంగా చెల్లించాలి. వ్యాపారం అధిక మొత్తంలో చేస్తూ తక్కువ చేసినట్లుగా చూపించి జీఎస్టీని ఎగవేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యాపారస్తులు సకాలంలో పన్నులు చెల్లిస్తేనే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. రియల్ ఎస్టేట్ రంగం పుంజుకున్నా జీఎస్టీ వసూళ్లు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. చీరాల ప్రాంతంలో వేరుశనగ పప్పు మిల్లులు, వస్త్ర వ్యాపారం, జీడిపప్పు, ధనియాలు ఎక్కువ మొత్తంలో ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. వేరుశనగ పప్పు మిల్లుల యజమానులు సరైన బిల్లులు లేకుండానే రూ.లక్షల్లో వ్యాపారాలు చేస్తున్నారు. వ్యాపార లావాదేవీలకు, చెల్లించే పన్నులకు పొంతన ఉండదు. అంతా జీరో వ్యాపారమే. జీఎస్టీ లేకుండానే వ్యాపారాలు సాగిస్తున్నా అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



రెడీమేడ్ వస్త్రాలదీ అదే దుస్థితి..

చీరాల నియోజకవర్గంలోని వేటపాలెం ప్రాంతంలో ఎక్కువగా జీడిపప్పు పరిశ్రమలు ఉన్నాయి. ఇతర ప్రాంతాలకు జీడిపప్పును నామమాత్రపు బిల్లులతో తరలించేస్తున్నారు. చెల్లించే నగదుకు రాసే బిల్లుకు పొంతన లేకుండా ఉంది. వస్త్ర వ్యాపారానికి సంబంధించి రెడీమేడ్ వస్త్రాలకైతే అసలు కాగితాలే ఉండవు. పండుగ సీజన్లలో ముంబయి, కోల్‌కత్తా ప్రాంతాల నుంచి ఎక్కువ మొత్తంలో వస్త్రాలను దిగుమతి చేసుకుంటారు. అధికారుల కళ్లుగప్పి రైల్వే పార్శిల్స్‌లో, ట్రాన్స్‌పోర్టు వాహనాలలో చీరాలకు తరలిస్తున్నారు. గతంలో రైల్వే పార్శిల్‌లో దిగుమతి చేసుకున్న రెడీమేడ్ వస్త్రాలను ఆదాయ పన్ను అధికారులు పట్టుకున్నారు. పేరుకు మాత్రమే వ్యాపార సంస్థగా చలామణి అవుతూ సరైన బిల్లులు, రబ్బర్ స్టాంపులు లేకపోవడంతో పార్శిల్ కార్యాలయాల్లో ఉండిపోతున్నాయి. ఎక్కువ మొత్తంలో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తూ జీఎస్టీలు లేకుండా ఎక్కువగా సరుకులు దిగుమతి చేసుకుంటున్నారు. సరైన పత్రాలు లేకుండా దిగుమతి అయిన మూటలు పార్శిల్ కార్యాలయాల్లో నిల్వ ఉండి పోతున్నాయి. బిల్లు కావాలంటే ఎక్కువ ధర అవుతుందని కొనుగోలుదారులను మభ్యపెడుతున్నారు.

అధికారుల ఉదాసీనత..

జీరో వ్యాపారంలో జరిగే అక్రమాలు గురించి జీఎస్టీ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. జీరో బిజినెస్‌కు ఒక్క రూపాయి కూడా జీఎస్టీ రాదు. జీఎస్టీ అధికారులు, ఆడిటర్లు కూడా పన్నులు తగ్గించేందుకు వ్యాపారులకు సూచనలు, సలహాలు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టీలు నుంచి ప్లాస్టిక్ సామాన్లు వరకు ఏ వస్తువు తీసుకున్న జీఎస్టీ బిల్లు ఉండదు. మొబైల్ షాపుల బిజినెస్ కూడా జీరో వ్యాపారమే. జీఎస్టీ అధికారులను దీనిపై అడిగితే 'మాకు తనిఖీ చేసే అధికారం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారులు ఆదేశిస్తారంటూ' చెబుతున్నారు. ఇదే అదనుగా కొందరు దిగువ స్థాయి సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. పార్శిల్ కార్యాలయాలలో తనిఖీలు చేస్తూ అపరాధ రుసుము విధిస్తున్నారు.

ఫిర్యాదు అందితే చర్యలు

చీరాలలో కొత్తగా బాధ్యతలు చేపట్టాను. ఇప్పటికే కొన్ని ఫిర్యాదులు అందిన మాట వాస్తవమే. త్వరలో వేరుశనగ పప్పు మిల్లులు, జీడిపప్పు పరిశ్రమలు, రెడీమెడ్ వస్త్రాలతో పాటు చీరాల కేంద్రంగా జరుగుతున్న వ్యాపార లావాదేవీలపై దృష్టి పెడతాం. తనిఖీలు చేపట్టి జరిమానాలు విధిస్తాం. అవసరాన్ని బట్టి జీఎస్టీ వసూలు చేస్తాం.

– శ్రీనివాస్,
జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్, చీరాల

ప్రకృతి సేద్యం ప్రపంచానికి ఆదర్శం

యద్దనపూడి: ఆదాయం..ఆరోగ్యంతో పర్యావరణాన్ని పరిరక్షించే ప్రకృతి వ్యవసాయ విధానం వైపు ప్రతి రైతు దృష్టి సారించాలని అమెరికా కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రతినిధుల బృందం యద్దనపూడి మండలం కొత్తపాలెం గ్రామంలో సోమవారం పర్యటించింది. బృందం సభ్యులైన చంద్రశేఖర్ బ్రీడర్, సిద్ధార్థ సచ్‌దేవ్, వేదసుంకర, అనుశెట్టి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతుల పద్ధతులు, పంటల వైవిధ్యాన్ని పరిశీలించారు. రసాయన క్షేత్రాలకు, ప్రకృతి సాగు క్షేత్రాలకు వ్యత్యాసాల అధ్యయనంపై వీరు వచ్చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో స్థానిక రైతులతో కలిసి బృందం మునగ తోట, దొండ పందిరి, సొర, కాకర, బీర వంటి అంతర పంటలు, కనకాంబరం, లిల్లీ పూల రకాల సాగును ప్రత్యక్షంగా వీక్షించారు. ప్రకృతి సేద్యం విధానాలను చూసి మంత్రముగ్ధులయ్యారు. రైతులు తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంటలు పండించడం, అంతర పంటల ద్వారా ఒక ఎకరంలోనే ఐదు ఎకరాల పంట తీసుకోవడం వంటివి అద్భుతమని కొనియాడారు. ముందుగా గ్రామంలోని శివాలయం వద్ద ప్రాజెక్ట్ మేనేజర్ కె. అమల కుమారి ప్రకృతి వ్యవసాయ 9 సార్వత్రిక సూత్రాల చక్రాన్ని, ఇన్‌పుట్స్ తయారీ విధానాన్ని వివరించారు. విత్తన గుళికల తయారీ డెమోను చేసి చూపించారు. మహిళా సంఘాల సభ్యులతో ప్రత్యేక సమావేశం జరిగింది.



అంతర సాగు విధానాన్ని పరిశీలిస్తున్న విదేశీ ప్రతినిధులతో స్థానిక రైతులు, అధికారులు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,600** గరిష్ఠం : రూ. **3,600**

మోడల్ ధర రూ. **3,200**

మిర్చి

యార్డు సమాచారం (సోమవారం ధరలు)



వచ్చిన బస్తాలు	51,722
అమ్మకాలు	49,176
నిల్వ	7,724

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,400
నంబరు-5	10,000-13,200
341	10,000-14,200

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,200
నంబరు-5	10,000-13,300
341	10,000-14,600
4884	10,000-12,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,200
బాడిగ-355	10,000 - 13,000
దేవనూరు డీలక్స్	10,000 - 13,000
ఆర్మూర్	9,800 - 11,000
తాలుకాయలు	5,000 - 7,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-14,000
బాడిగ - 355	10,000-12,500
దేవనూరు డీలక్స్	10,200 - 12,800
తాలు	5,300 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)



పసుపు ధరలు

(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : **758**

కొమ్ములు : **543** బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ : (ధర రూ॥ల్లో)	మోడల్ :
9,400	10,500	10,381

కాయలు : **170** బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,400	10,500	10,350

మొత్తం అమ్మకాలు : **568.500** క్వింటాళ్లు

వృద్ధులు, మహిళల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

బాపట్లటౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరై ఫిర్యాదులు చేసే మహిళలు, వృద్ధుల సమస్యలపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 54 మంది అర్జీదారులు తమ సమస్యలను ఎస్పీకు వివరించారు. సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, పీజీఆర్ఎస్ సెల్ సీఐ యు.శ్రీనివాసరావు, జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● బాధితుల సమస్యలు విన్న ఎస్పీ వెంటనే సంబంధిత పోలీసు సిబ్బందికి ఫోన్ చేసి, పూర్తి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని అర్జీదారులకు భరోసా కల్పించారు.



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్‌డూడీ

కొడుకు ఇబ్బందులు పెడుతున్నాడు

నాకు ఇద్దరు కుమారులు. నాకున్న ఆస్తిని ఇద్దరు కుమారులకు సమానంగా పంచాను. నా పేరుతో కొంత ఆస్తిని ఉంచుకున్నాను. అయితే పెద్ద కుమారుడు నా భాగంలో వచ్చిన ఆస్తిని కూడా దక్కించుకునేందుకు నిత్యం నన్ను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు.

– అలకుంట గురవయ్య, బల్లికురవ

ఓబీసీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలి

నెహ్రూనగర్: దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఓబీసీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ కోరారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలోని జాతీయ బీసీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ హన్స్‌రాజ్ గంగారామ్ అహీర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 63 కేంద్ర ప్రభుత్వ శాఖల్లో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యా, ఉపాధి రంగాల్లో ఓబీసీలకు రిజర్వేషన్ల పరిరక్షణకు తగిన చొరవ చూపాలన్నారు. గత 3, 4 సంవత్సరాలుగా వివిధ రాష్ట్రాలలో నీట్ సీట్ల భర్తీ విషయంతో తీవ్ర అన్యాయం జరుగుతుందని దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. దేశంలో 52శాతానికి పైగా జనాభా కలిగిన ఓబీసీల సాధికారిత కోసం ఓబీసీ సబ్ ప్లాన్ చట్టాన్ని రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వానికి



జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారామ్ అహీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సిఫార్సు చేయాలని సూచించారు. కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడంతో పాటు ఓబీసీల్లోని అన్ని కులాల విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం అమలు చేసేలా చూడాలని కోరారు. ఆయనవెంట ఏపీ బొందిలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుజాన్ సింగ్, ఓబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణంరాజు, సంఘ నాయకులు ఉరిటి అశోక్‌కుమార్, ముంగమూరి హైమారావు, ఖాసీం పాల్గొన్నారు.

క్రీడలు, కళలతో ఒత్తిడి దూరం

కొరిటెపాడు(గుంటూరు): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుంటూరు జోనల్ క్రీడలు మరియు సాంస్కృతిక కార్యక్రమాల పోటీలు ఉద్యోగులు కుటుంబ సభ్యుల సమక్షంలో ఆదివారం సాయంత్రం రెవెన్యూ కల్యాణ మండపంలో ఆహ్లాదకరంగా జరిగాయి. అందులో భాగంగా, ఆడంబరాల వల్ల వచ్చే తంటాలను తెలియపరుస్తూ కోటి రెడ్డి దర్శకత్వంలో గరికపాటి శ్రీనివాసరావు రచించిన కలహాల కాపురం నాటకం, పిల్లల నృత్య ప్రదర్శన, ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన పెండ్యాల రమేష్, విజయ సంపత్, చెరుకూరి వీరాంజనేయులు తదితరులకు గుంటూరు పట్టణ రీజనల్ మేనేజర్ కిషోర్‌కుమార్, చీఫ్ మేనేజర్ ఆనంద్ కిషోర్, పావులూరి రంగసాయి బహుమతులను అందజేశారు. నాటకరంగాన్ని ప్రోత్సహిస్తున్న స్టేట్ బ్యాంకు ఉద్యోగులను నాటక రంగ ప్రముఖులు జంపని కిషోర్ బాబు, వరికూటి శివప్రసాద్‌లు అభినందించారు.



బహుమతులు అందజేస్తున్న కిషోర్ కుమార్, ఆనంద్ కిషోర్, రంగసాయి

కొల్లిపరలో 27.2 మి.మీ వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా కొల్లిపర మండలంలో 27.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా వట్టిచెరుకూరు మండలంలో 1.2 మి.మీ వర్షం పడింది. సగటున 6.7 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. గుంటూరు పశ్చిమలో 20.6 మి.మీ, గుంటూరు తూర్పు 16.8, పెదకాకాని 15.4, తుళ్లూరు 12.6, ఫిరంగిపురం 6.8, కాకుమాను 3.8, ప్రత్తిపాడు 3.2, చేబ్రోలు 2.8, మంగళగిరి 2.4, తాడికొండ 2.2, పొన్నూరు 2, తెనాలి 1.8, మేడికొండూరు మండలంలో 1.6 మి.మీ చొప్పున వర్షం పడింది.

భవిత కేంద్రం తనిఖీ



చుండూరు(వేమూరు): భవిత కేంద్రంలో దివ్యాంగులకు ప్రత్యేకమైన సేవలు అందించడం జరుగుతుందని జిల్లా సమగ్ర శిక్ష అధికారి మట్ట జోత్స్న అన్నారు. చుండూరు మండలంలోని మున్నంగి వారి పాలెం గ్రామంలో భవిత కేంద్రాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ దివ్యాంగులైన చిన్నారులకు భవిత కేంద్రం ద్వారా అనేక సేవలు అందించడం జరుగుతుందన్నారు. గతేడాది 80 మంది చిన్నారులకు ఆలవెన్సులు అందించడం జరిగిందని, భవిత కేంద్రంలో చదువున్న చిన్నారులకు ప్రభుత్వం సదరం సర్టిఫికెట్లు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

రేపల్లె: బాపట్ల జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ సెంటర్, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో శారద ఐటీఐ కళాశాలలో ఈ నెల 12వ తేదీ మంగళవారం 10 గంటల నుంచి మెగా జాబ్ మేళా జరుగుతుందని కళాశాల కరస్పాండెంట్ వెంకటనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ అన్ని గ్రూపులు, ఐటీఐ అన్ని గ్రూపులు, పాలిటెక్నిక్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ గ్రూపులకు చెందిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చునన్నారు. 20 ప్రముఖ కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరై అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

5వ తరగతిలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానం

చెరుకుపల్లి: కావూరు గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో చేరేందుకు ఆసక్తిగల బాల బాలికలు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ కె.విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో మిగిలిన సీట్లకు గాను ప్రవేశ పరీక్ష నిమిత్తం ఈ నెల 14వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు విద్యార్థుల ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికేట్, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలతో కావూరు గురుకుల పాఠశాలలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. వీరికి 16వ తేదీ 10 గంటల నుంచి 12గంటల వరకు పరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయించటం జరుగుతుందన్నారు.

రేపల్లె-గుంటూరు రైళ్లను పునరుద్ధరించాలి

రేపల్లె: చుండూరు - తెనాలి - పెదవడ్లపూడి మధ్య జరుగుతున్న పనుల కారణంగా రేపల్లె - తెనాలి, గుంటూరు- రేపల్లె మధ్య ఈ నెల 8వ తేదీ నుంచి 25వ తేదీ వరకు కొన్ని రైళ్లను పూర్తిగాను, మరికొన్నింటిని పాక్షికంగాను రద్దు చేయడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రేపల్లె వినియోగదారుల సంఘం అధ్యక్షుడు సీవీ మోహనరావు తెలిపారు. రేపల్లెలోని సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైళ్లను రద్దు చేయడం వల్ల తీర ప్రాంతంలోని ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ పనులపై నిత్యం గుంటూరు, తెనాలి ప్రాంతాలకు వెళ్లే కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైళ్లు లేకపోవడంతో బస్సులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. రేపల్లె నుంచి గుంటూరు, తెనాలి ప్రాంతాలకు సరైన రహదారి సదుపాయం లేకపోవడంతో బస్సులకు వెళ్లేవారికి సమయం వృథా అవుతుందన్నారు. ఈ ప్రాంత ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఉదయం, మధ్యాహ్నం రాత్రిళ్లు రైళ్లను నడపాలని ఆయన కోరారు. ఈ మేరకు రైల్వే ఉన్నత అధికారులకు వినతిపత్రం పంపామన్నారు.

ముగ్గురు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

తాడికొండ: మండల పరిధిలోని బండారుపల్లి గ్రామానికి చెందిన వివాహిత గండాల వరలక్ష్మి తన ముగ్గురు పిల్లలతో సహా కనిపించడం లేదని ఆమె తండ్రి పువ్వాడ అంత్యాక్షరి తాడికొండ పోలీసు స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. వరలక్ష్మితోపాటు కుమారులు 12 ఏళ్ల మల్లికార్జునరావు, తొమ్మిదేళ్ల లీలామనోహర్, ఏడేళ్ల కుమార్తె మహాలక్ష్మి కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసుపై డీఎస్పీ విచారణ

బల్లికురవ: బాలికలు, మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని బాపట్ల డీఎస్పీ జీ. రామాంజనేయులు కోరారు. ఈనెల 9వ తేదీన మండలంలోని ఓ బాలికను గర్భిణిని చేసిన ఘటనపై ఒంగోలు వైద్యశాల నుంచి వచ్చి ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. సోమవారం డీఎస్పీ బాలిక కుటుంబ సభ్యులు, గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. విచారణలో బల్లికురవ ఎస్సై వై.నాగరాజు పాల్గొన్నారు.

భార్యను హతమార్చిన కేసులో భర్త అరెస్టు

సంతమాగులూరు(అద్దంకి): భార్యను కత్తితో నరికి హతమార్చిన ఘటనలో భర్తను పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 8వ తేదీ రాత్రి మండలంలోని ఏల్చూరు గ్రామంలో భార్యభర్తల మధ్య గొడవల కారణంగా భర్త సల్లూరి గిరిప్రసాద్ అలియస్ మేరిబాబు సుబ్బమ్మను కత్తితో నరికి హతమార్చి పరారైన సంగతి విదితమే. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. బంధువుల ఫిర్యాదు మేరకు నిందితుడు సల్లూరి గిరిప్రసాద్‌ను సోమవారం గ్రామ శివారుల్లో అరెస్టు చేసినట్లు ఎస్సై పట్టాభిరామయ్య తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

అద్దంకి రూరల్: డీజే బాక్సులు విప్పుతుండగా విద్యుత్‌షాక్‌తో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి మండలంలో చోటుచేసుకోగా సోమవారం వెలుగులోకి వచ్చింది. మృతుడి బంధువుల వివరాల మేరకు.. ముండ్లమూరు మండలం భీమవరం గ్రామానికి చెందిన నాగేంద్రబాబు (25) ఫంక్షన్‌లకు డీజే బాక్సులు ఏర్పాటు చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో మండలంలోని ధర్మవరం గ్రామంలో ఆదివారం రాత్రి డీజే ఏర్పాటు చేశారు. కార్యక్రమం అయిపోయిన తరువాత డీజే బాక్సులు విప్పదీస్తుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. స్థానికులు వెంటనే కారులో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాల మార్చురీలో ఉంచారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పిడుగురాళ్ల: వరుసగా మూడు రోజులు సెలవులు రావటంతో ఇంటికి తాళం వేసి ఊరెళ్లిన ఒకరి ఇంట్లో చోరీ జరిగిన ఘటన పిడుగురాళ్ల పట్టణంలోని బస్టాండ్ వెనుక ప్రాంతంలో చోటు చేసుకుంది. బాధితుడు వి.ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం... వరుసగా ప్రభుత్వ సెలవులు రావటంతో బంధువుల ఇంటికి కుటుంబ సభ్యులతో తామెళ్లామని, తిరిగి సోమవారం ఉదయం రావటంతో ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయని, తలుపులు తీసి చూస్తే, బీరువాలోని దుస్తులన్నీ కింద పడవేసి ఉన్నాయని, బీరువా లాకర్ పగలగొట్టి ఉందని తెలిపారు. బీరువాలోని నగదు, బంగారు నగలు, వెండి వస్తువులు కనిపించకపోవటంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించామని తెలిపారు. పిడుగురాళ్ల పట్టణ ఎస్ఐ మోహన్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి క్లూస్ టీమ్‌కు సమాచారం అందించారు. దీంతో క్లూస్ టీమ్ ఎస్ఐ రహీమ్, ఏఎస్ఐ సురేంద్రల బృందంతో దొంగతనం జరిగిన విధానాన్ని, దొంగలు ఏమైనా ఆధారాలు విడిచిపెట్టారనే విషయాన్ని, వేలిముద్రలను సేకరించారు. బాధితుడు ఆంజనేయులు బీరువాలో రూ. 50 వేల నగదు, సుమారు రూ. 15 లక్షల విలువ చేసే బంగారు అభరాణాలు, వెండి వస్తువులు చోరీకి గురయ్యాయని తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ శివనాగరాజు తెలిపారు.

దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు రామయ్య
- చీరాల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న దివ్యాంగురాలు దేవికకు పరామర్శ

కారంచేడు: దివ్యాంగురాలైన పాదిలి దేవికపై గత రెండు రోజుల క్రితం దాడి చేసిన దుండగులపై వెంటనే కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన చీరాల ప్రభుత్వ ఆసుపత్రిలో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న కారంచేడు గ్రామానికి చెందిన దివ్యాంగురాలు పాదిలి దేవికను పరామర్శించారు. అనంతరం కారంచేడు పోలీస్‌స్టేషన్‌లో సీఐను కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. అకారణంగా దివ్యాంగురాలైన దేవికపైన అదే గ్రామానికి చెందిన యార్లగడ్డ శ్రీకృష్ణ, అతని భార్య సుజాతలు కలసి ఈ నెల 8వ తేదీన దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. తీవ్రంగా గాయపడిన ఆమెను బంధువులు చీరాల ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంచి వైద్యం చేయిస్తున్నారన్నారు.



చీరాల ప్రభుత్వ ఆసుపత్రిలో దేవికను పరామర్శిస్తున్న చల్లా రామయ్య

ఇంత జరిగినా నిందితులపై ఇంతవరకు పోలీసులు కేసు నమోదు చేయలేదని ఆయన ఆరోపించారు. 2016 దివ్యాంగుల హక్కుల చట్టం కింద సెక్షన్ 92 ప్రకారం వారిపై కేసు నమోదు చేయడమే కాకుండా వారిని కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే తీవ్ర గాయాలతో ఉన్న దేవికకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. ఆమెకు న్యాయం జరగని పక్షంలో జిల్లా ఎస్పీని కలసి పోరాటం చేయడానికి సైతం వెనుకాడబోమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ నాయకులు కె.చిట్టిబాబు, బీసీ సంఘాల నాయకులు బాపట్ల రవికుమార్, చేజర్ల సతీష్‌లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

డీఈఓ ఎస్.పురుషోత్తం

చెరుకుపల్లి: విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా వ్యాధులు దరిచేరవని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.పురుషోత్తం పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలో గుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలలో జరిగే ఎఫ్ఏ పరీక్షల సరళిని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠశాలలో, ఇంటి వద్ద ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. లేని పక్షంలో విషజ్వరాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఇళ్ల వద్ద నిల్వ ఉన్న పాత టైర్లు, కొబ్బరి బొండాలు, మురుగు నీటిలో దోమలు వృద్ధి చెందుతాయని వాటిని వెంటనే తొలగించి దోమలు వృద్ధి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఎస్ఓ, సంజయ్‌కుమార్, ఏపీఓ డీవీ శ్రీనివాస్, డీఎస్ఓ షమీర్‌చంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గుళ్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో విష జ్వరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఈఓ

చిన్నారులపై ఔదార్యం చూపండి

గుంటూరు వెస్ట్: సమాజంలో ఏ పాపం చేయకపోయినా అనాథలుగా జీవించే వారిపట్ల ఔదార్యం ప్రదర్శించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారితో కలిసి కలిసొచ్చే కాలానికి – నడిచొచ్చే పిల్లలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. సమాజంలో ఎవరైనా చిన్నారులను పెంచుకోవాలి అనుకున్న వారికి హోమ్స్‌లో ఉన్న 6-18 సంవత్సరాల వయస్సున్న వారిని తాత్కాలికంగా తొలి 6 నెలలు తమ ఇంటికి తీసుకెళ్లి పెంచుకోవచ్చన్నారు. ఇద్దరికీ నచ్చితే మరో ఆరు నెలలు ఇలా 2 సంవత్సరాల వరకు పెంచుకుని ఆ తర్వాత పూర్తి స్థాయిలో దత్తత తీసుకునే వీలుంటుందని వెల్లడించారు. దీనికిగాను బిడ్డ ఖర్చులకు కేంద్ర ప్రభుత్వం ప్రతి నెలా రూ.4000 ఉచితంగా అందజేస్తుందన్నారు. దీనివలన ఎంతో మంది అనాథలకు తల్లిదండ్రులు, గార్డియన్స్ లభిస్తారని, పిల్లలకు కూడా మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఔత్సాహికులు ముందుకు వచ్చి సంప్రదించాలని కోరారు. ఐసీడీఎస్ పీడీ ప్రసూన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏడుగురు కమిటీ సభ్యులు దత్తత కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జ్యోతిబసు, హౌసింగ్ పీడీ ప్రసాద్, సీపీఓ శేషశ్రీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ

దళిత, గిరిజనులకు నేటికీ స్వాతంత్ర్యం రాలేదు

మంగళగిరి టౌన్: భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు అయినా నేటికీ దళిత, గిరిజనులను స్వాతంత్ర్యం రాలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళగిరి నగర పరిధి టిప్పర్ల బజారులోని కేవీపీఎస్ (కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం) గుంటూరు జిల్లా 6వ మహాసభ ఆదివారం రాత్రి నిర్వహించారు. సామాజిక న్యాయం అంశంపై జరిగిన సెమినార్‌లో శ్రీనివాసరావు మాట్లాడుతూ దళితులు ఎదుర్కొంటున్న ఆర్థిక రాజకీయ సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా దళిత ఉద్యమానికి కంచుకోట అని అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే గుంటూరు జిల్లాలో అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయని గుర్తు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అసమానతలు, దళితులపై దాడులు నిత్యకృత్యమయ్యాయన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం ఉన్నప్పటికీ దళిత, గిరిజనులకు న్యాయం జరగడం లేదన్నారు. ఈ చట్టం అమలు చేయడంలో పాలకులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని విమర్శించారు. డాక్టర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని అమలు చేసే పరిస్థితుల్లో పాలకులు లేరన్నారు. గిరిజన ప్రాంతాల్లో అదానీకి భూములు అప్పగించడానికి కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. పీ-4 పథకం ఓ చెత్త పథకమన్నారు. అనంతరం 15 మందితో కూడిన కేవీపీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా వై.కమలాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా నవీన్ ప్రకాష్, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వర్లు, లూదర్ పాల్, సహాయ కార్యదర్శులుగా దుర్గారావు, రమేష్‌లను ఎన్నుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ఐడీబీఐ బ్యాంక్ వద్ద నిరసన

కొరిటెపాడు(గుంటూరు): ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏఐబీఈఏ) దేశంలోని అన్ని ఐడీబీఐ బ్యాంకుల్లో ఒకరోజు సమ్మె ప్రకటించారు. ఈ పిలుపులో భాగంగా గుంటూరు లక్ష్మీపురంలోని ఐడీబీఐ బ్యాంకు బ్రాంచ్ వద్ద గుంటూరు జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు. బ్యాంక్ ఉద్యోగుల సంఘం సలహాదారుడు పి.కిషోర్ కుమార్ మాట్లాడుతూ లాభాల బాటలో నడుస్తున్న ఐడీబీఐ బ్యాంకును కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ చేస్తున్న సమ్మెకు జిల్లాలోని అన్ని బ్యాంకుల ఉద్యోగుల పూర్తి మద్దతు ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రభుత్వ రంగ గ్రామీణ బ్యాంకుల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను తీవ్రస్థాయిలో ఎదుర్కొనేందుకు కలసికట్టుగా పోరాడతామని హెచ్చరించారు. ఐడీబీఐ ఉద్యోగుల నాయకుడు సోమసుందరం మాట్లాడుతూ ఐడీబీఐ బ్యాంకును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. బ్యాంకును కాపాడుకోవడానికి ఎంతవరకైనా పోరాడుతామని స్పష్టం చేశారు. బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం జిల్లా కార్యదర్శి బాషా మాట్లాడుతూ ఈ సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. జిల్లా బ్యాంకు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవిచంద్రారెడ్డి, ఐడీబీఐ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న కిషోర్ కుమార్, బాషా, సోమసుందరం తదితరులు

నాలుగు కిలోల గంజాయి పట్టివేత

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని గుంటూరు రైల్వే స్టేషన్‌లో సోమవారం నాలుగు కిలోల గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు రైల్వేస్టేషన్‌లో మత్తు పదార్థాల రవాణా నివారణ చర్యలలో భాగంగా గుంటూరు ఆర్పీఎఫ్, జీఆర్పీ, కొత్త పేట పోలీసులు సంయుక్తంగా తనిఖీ లు నిర్వహించారు. ఈ తనిఖీలలో రైల్వే స్టేషన్ తూర్పు వైపు ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనించారు. వారి వద్ద ఉన్న బ్యాగ్‌లను తనిఖీ చేయగా నాలుగు కిలోల గంజాయి బయటపడింది. ఇద్దరు నిందితులను అదుపులో తీసుకున్న పోలీసులు జీఆర్పీ స్టేషన్‌కు తరలించి విచారించగా కర్ణాటకు రాష్ట్రంలో మల్లన్న కుప్పె, మద్దూర్ తాలుకాకు చెందిన మహేష్, కర్ణాటక రాష్ట్రం దుందనహళ్లి, మల్లూర్ ప్రాంతానికి చెందిన అశ్వత్‌గా తేలింది. వీరిద్దరు చెడు వ్యసనాలకు అలవాటు పడి, సులువైన మార్గాల్లో డబ్బు సంపాదనకు గంజాయి తరలింపును ఎంచుకున్నారు. విశాఖపట్నం నుంచి బెంగళూరుకు గంజాయితో వెళుతున్నట్లు తెలిపారు. నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ తనిఖీలలో జీఆర్పీ సీఐ అంజిబాబు, కొత్తపేట సీఐ వీరయ్య, ఆర్పీఎఫ్ ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ గుంటూరు జీరో లైన్, నల్లచెరువు, సంపత్‌నగర్ వెళ్లే రోడ్డుకు దగ్గరలో టీ.పామ్ 78గజాలు కింద డబుల్ బెడ్ రూమ్, పైన రేకులతో రెండు పోర్షన్ ఇల్లు 45లక్షలకు అమ్మబడును. 9959820729

LAND FOR SALE

■ 'మెగా అవకాశ్' ఫామ్‌ల్యాండ్ '11సెంట్లు 5 లక్షలు మాత్రమే. 5 నుండి 60 సంవత్సరముల వరకు ఏటా 2 నుండి 5 లక్షల ఆదాయం పొందవచ్చు. ఫోన్: 9133574455

PLOT FOR SALE

■ గుంటూరు సిటీ కార్పొరేషన్ పరిధిలో 500 గజాల స్థలం అమ్మబడును. సంప్రదించండి. 89783 89518, 63037 24464.

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారాం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

WANTED

■ ఫ్రీ కంప్యూటర్ M.S Office, Spoken English కోర్సు 3 నెలల శిక్షణ ఇచ్చి ఉపాధి చూపబడును. ఫ్రీ భోజనం హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ, 18-28సం॥లోపు. 9133444989/ 88

■ స్వామి వివేకానంద గ్రూపు (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు 10th చదివిన వర్కర్లు కావలెను. భో+వ+జీ. 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000 ✆ 9502501122, 9573691122

■ మంగళగిరి తెనాలి ఏరియాలో పురుగు మందు కంపెనీలో పనిచేయుటకు యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 15,000+3000. సంప్ర॥ 9121469383

■ గుంటూరు లక్ష్మీపురంలోని ప్రముఖ డెంటల్ హాస్పిటల్ నందు P/F టైమ్ పనిచేయుటకు M/F రిసెప్షనిస్ట్ & క్లీనింగ్ స్టాఫ్ కావలెను. వ: 25సం॥ లోపు లోకల్ వారు మాత్రమే. 8500808778

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ 20K. ఫోన్: 8977639662, 8977639663

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్
రూ. 475/- మాత్రమే (4లైన్లు)
ప్రతి అదనపు లైను రూ. 100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.